క్లుప్తంగా

నేడు మంత్రి వనిత ఎన్నికల ప్రచారం

దేవరపల్లి: రాష్ట్ర హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత మంగళవారం నల్లజర్ల మండలం దూబచర్ల, కొత్తగూడెం, అయ్యవరం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఆ పార్టీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్ సోమవారం తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమయ్యే ప్రచారంలోని మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

'గురుకుల' టాపర్లకు కలెక్టర్ అభినందనలు



గురుకుల పాఠశాల విద్యార్థినులను అభినందిస్తున్న కలెక్టర్ మాధవీలత

గోపాలపురం: ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులను సోమవారం జిల్లా కలెక్టర్ కె.మాధవీలత అభినందించారు. ఈ గురుకుల పాఠశాలలో నిర్వహించిన పోలింగ్ అధికారుల శిక్షణ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఇంటర్ సెకండియర్‌లో 966 మార్కులు సాధించిన కె.కృష్ణవేణి, 964 మార్కులు సాధించిన కె.సౌమ్య, ఇంటర్ ఫస్టియర్‌లో 424 మార్కులు సాధించిన ఎస్. స్పందన, 429 మార్కులు సాధించిన ఎం.నిర్మలకుమారిని, ప్రిన్సిపాల్ తాళ్లూరి ఉమాదేవి, ఉపాధ్యాయులను కలెక్టర్ అభినందించారు.

వాహన తనిఖీల్లో నగదు స్వాధీనం

నల్లజర్ల: సరైన ఆధారాలు చూపకుండా ఇద్దరు వేర్వేరు వ్యక్తులు తరలిస్తున్న నగదును సోమవారం ఎన్నికల నిఘా అధికారులు మండలంలో స్వాధీనం చేసుకున్నారు. ప్రకాశరావు పాలెంలోని వైజ్ కళాశాల వద్ద అధికారులు ఓ వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో ఉన్న రైతు వద్ద రూ.83 వేలు లభ్యమయ్యాయని ఫ్లెయింగ్ స్క్వాడ్ అధికారి లావణ్య తెలిపారు. పిచ్చుకల గౌతమ్ అనే ఆ రైతు పాడిగేదె కొనుగోలు కోసం జంగారెడ్డిగూడెం నుంచి ఈ సొమ్ము తీసుకువెళుతున్నారని ఆమె చెప్పారు. ఈ సొమ్ముకు ఆ రైతు ఎటువంటి ఆధారాలు చూపక పోవడంతో సీజ్ చేసినట్టు లావణ్య తెలిపారు. అలాగే వీరవల్లి టోల్ ప్లాజా వద్ద వల్లభ మిల్క్ వ్యాను నుంచి రూ.65,560 స్వాధీనం చేసుకున్నట్టు నల్లజర్ల ఏఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ వ్యాన్ శరభాపురం నుంచి యర్నగూడెం వస్తుండగా డ్రైవర్ శెట్టిమళ్ల హర్ష వద్ద నుంచి ఈ మొత్తాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్టు ఏఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

రూ. 1.30 లక్షల నగదు స్వాధీనం

నిడదవోలు: వాహన తనిఖీల్లో భాగంగా సోమవారం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు మండలంలోని కోరుమామిడి గ్రామ శివార్లలో రూ.1.30 లక్షల నగదు పట్టుకున్నారు. యర్నగూడెం నుంచి నిడదవోలు పట్టణానికి వెళుతున్న ఎల్ఐసీ ఏజెంట్ మోటార్ సైకిల్‌ను ఆపి తనిఖీ చేయగా డిక్కీలో ఉన్న రూ.1.30 లక్షలు లభ్యమయ్యాయి. ఈ నగదుకు సంబంధించి ఆ ఏజెంట్ వద్ద ఎటువంటి ఆధారాలు, పత్రాలు లేకపోవడంతో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి పి. సుజాత రాజమహేంద్రవరం ట్రెజరరీలో నగదును జమ చేసినట్లు సుజాత తెలిపారు.

యాదవోలు వద్ద రూ.లక్ష స్వాధీనం

దేవరపల్లి: ఎటువంటి ఆధారాలు లేకుండా బైక్‌పై యర్నగూడెం నుంచి యాదవోలు తీసుకు వెళుతున్న రూ. 1 లక్ష నగదును సోమవారం రాత్రి ఫ్లయింగ్ స్క్వాడ్–2 అధికారులు స్వాధీనం చేసుకున్నారు. యాదవోలు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా గ్రామానికి చెందిన డి.శివరామకృష్ణ బైక్‌లో రూ. 1 లక్ష గమనించి స్వాధీనం చేసుకున్నట్టు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఎస్. రవికిషోర్ తెలిపారు. తనకు యర్నగూడెంలో పురుగు మందుల దుకాణం ఉందని, బ్యాక్ ఆఫ్ బరోడా నుంచి రూ.4 లక్షల చెక్కు మార్చుకుని దీనిలో రూ. 3 లక్షల వ్యాపార నిమిత్తం చెల్లించి మిగిలిన రూ.1 లక్ష ఇంటికి తీసుకువస్తున్నట్టు శివరామకృష్ణ తెలిపారు. దీనికి సంబంధించి అతని వద్ద ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసి దేవరపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్టు టీమ్ లీడర్ ఎస్. రవికిషోర్ తెలిపారు.

మద్యం అక్రమ నిల్వలపై ప్రత్యేక నిఘా

కొవ్వూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం అక్రమ నిల్వలు, సారా తయారీ, అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో (ఎస్ఈబీ) అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ ఆదేశించారు. కొవ్వూరు ఎస్ఈబీ స్టేషన్‌ను సోమవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. సారా తయారీ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. సారా తయారు చేస్తున్న గ్రామాల్లోను, గోదావరి లంకల్లో విస్తృతంగా దాడులు నిర్వహించాలని ఆదేశించారు. అక్రమ మద్యం నిల్వలపై ప్రత్యేక దృష్టి సారించాలని, సమాచారం సేకరించి దాడులు నిర్వహించాలని ఆదేశించారు. ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసరావు, ఎస్సైలు ఎన్.కల్యాణి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పూర్తి పారదర్శకంగా ఎన్నికలు

- బాధ్యతగా విధులు నిర్వహించండి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాధవీలత ఆదేశం
- కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురాల్లో పోలింగ్ అధికారులకు ఒక రోజు శిక్షణ



కొవ్వూరు అసెంబ్లీ సెగ్మెంట్ ఎన్నికల ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాధవీలత

కొవ్వూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, సిబ్బంది పోలింగ్ కేంద్రాల్లో తమ విధులను బాధ్యతగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత ఆదేశించారు. కొవ్వూరు డివిజన్‌లోని కొవ్వూరు,నిడదవోలు, గోపాలపురం అసెంబ్లీ సెగ్మెంట్ల ఎన్నికల అధికారులు, సిబ్బందికి సోమవారం ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో వేర్వేరుగా శిక్షణ తరగతులు నిర్వహించారు. మూడు చోట్లకూ కలెక్టర్ మాధవీలత హాజరై వారిని ఉద్దేశించి మాట్లాడారు. కొవ్వూరులోని దీప్తి ఇంగ్లిషు మీడియం స్కూల్లో నిర్వహించిన తరగతుల్లో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు పోలింగ్‌పై పూర్తిగా అవగాహన పెంచుకోవాలన్నారు. పోలింగ్‌కు ముందు రోజు, పోలింగ్ నాడు, పోలింగ్ అనంతరం నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలపై మాస్టర్ ట్రైనీలు సమగ్ర అవగాహన కల్పించారు. పలువురు అధికారుల సందేహాలను నివృత్తి చేశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద అందించే పోలింగ్ సామగ్రిని చెక్ లిస్టు ప్రకారం సరిచూసుకోవాలని కలెక్టర్ అన్నారు. ఓటింగ్ పూర్తయిన తర్వాత ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను రిసెప్షన్ కేంద్రాల వద్ద అందజేసేంత వరకూ జాగ్రత్తగా వ్యవహరించాలని ఆదేశించారు. అనంతరం డెమో బ్యాలెట్ బాక్సులు, ఈవీఎం, వీవీ ప్యాడ్‌లను చూపిస్తూ వాటి నిర్వహణ, పనితీరుని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కొవ్వూరు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ్, సహాయ రిటర్నింగ్ అధికారి కె.మస్తాన్, పీవోలు, ఏపీవోలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణకు 90 మంది గైర్హాజర్

నిడదవోలు: పోలింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు తమ విధులను బాధ్యతగా నిర్వహించాలని కలెక్టర్ మాధవీలత అన్నారు. సమిశ్రగూడెంలోని వికాస్ జూనియర్ కళాశాలలో సోమవారం పీవో, ఏపీవోలకు నిర్వహించిన శిక్షణ తరగతులను కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన పలు అంశాలను ఎల్ఈడీ స్క్రీన్‌పై కలెక్టర్ వారికి వివరించారు. ఎన్నికల విధులకు హాజరు కాని వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా శిక్షణకు మొత్తం 464 మంది పీవోలు, ఓపీలోలు హాజరు కావాల్సి ఉండగా 90 మంది హాజరు కాలేదని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ) ఆర్. వెంకటరమణనాయక్ తెలిపారు. తహసీల్దారు నాగభూషణం, మున్సిపల్ కమిషనర్ రాంభూపాల్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులు సమన్వయంతో పని చేయాలి

గోపాలపురం: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ విధులను ఉద్యోగులు సమన్వయంతో నెరవేర్చాలని జిల్లా కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే నియోజకవర్గంలోని ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు సోమవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించారు. హాజరైన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఏమైనా సమస్యలు ఎదురైతే నేరుగా ఆర్వో లేదా తనకు ఫిర్యాదు చేయాలన్నారు. పోలింగ్ సమయంలో ఈవీఎంల పనితీరును జాగ్రత్తగా పరిశీలించుకోవాలని సూచించారు. సార్వత్రిక ఎన్నికల విధుల నుంచి ఏ ఒక్కరికీ మినహాయింపు లేదని ఆమె స్పష్టం చేశారు. గోపాలపురం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.శివజ్యోతి, ట్రైనీ కలెక్టర్ కె సువర్ణ, తహసీల్దార్ డి.వనజాక్షి, డిప్యూటీ తహసీల్దార్ ఎస్. కృష్ణ, దుర్గామహాలక్ష్మి, దేవరపల్లి, నల్లజర్ల, ద్వారకాతిరుమల, గోపాలపురం మండలాల ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా



సచివాలయ కార్యదర్శి శ్రీనివాస్‌కు రాజీనామా పత్రాలు అందిస్తున్న జగన్నాథపురం వలంటీర్లు

నల్లజర్ల: మండలంలోని జగన్నాథపురం గ్రామ సచివాలయం పరిధిలోని 9 మంది వలంటీర్లు సోమవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. వారు తమ రాజీనామా లేఖలను పంచాయతీ కార్యదర్శి రాజులపాటి శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వలంటీర్లు మాట్లాడుతూ జగనన్నపై రాయి దాడి తమను ఎంతగానో కలచి వేసిందన్నారు. సాయం కోసం ఎదురుచూసే వారికి సేవ చేయలేని కొలువు తమకు వద్దన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై అభిమానాన్ని చాటుకోవడానికి ఇప్పటి వరకూ వలంటీర్ పదవి అడ్డుగా ఉందని, ఈ బంధాన్ని తెంచుకొని తాము ఇకపై జగనన్న తరఫున ఎన్నికల్లో ప్రచారం చేస్తామన్నారు. రాజీనామా చేసిన వారిలో వీరమళ్ల కాంచన, అంబటి వాణి, అంబటి శిరీష, బాతు అన్నాకుమారి, బుంగా రమేష్, గుదే కిరణ్, కల్లెం భార్గవి, బుంగా వినీత్ ఉన్నారు. అలాగే మండలంలోని పుల్లలపాడు సచివాలయంలో 15 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను కార్యదర్శి సుంకర కుమార్‌కు అందజేశారు.

అవినీతి రహిత పాలన జగన్‌తోనే సాధ్యం



చాగల్లులో ఇంటింటా ప్రచారంలో మహిళకు కరపత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు

- వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు
- చాగల్లులో ఇంటింటా ఎన్నికల ప్రచారం

చాగల్లు: అవినీతి, లంచాలకు ఆస్కారం లేకుండా ప్రజా సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేయడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారని వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు అన్నారు. రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగాలంటే ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజాశీర్వాదం కార్యక్రమంలో భాగంగా పార్టీ శ్రేణులతో కలసి సోమవారం ఆయన చాగల్లులో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే తలారి గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేసిన సంక్షేమాన్ని, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. ప్రజా సమస్యలపై ఆరా తీశారు. వచ్చే ఎన్నికల్లో అందరూ ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో తమను గెలిపించాలని అభ్యర్థించారు. తాము ఏ గడపకు వెళ్లినా చిరునవ్వుతో ప్రజలు తమను ఆహ్వానిస్తున్నారని వెంకట్రావు అన్నారు. ప్రచారంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంద్రోతు సురేంద్రకుమార్, పార్టీ మండల గౌరవాధ్యక్ష, అధ్యక్షులు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు నాయకులు ముళ్లపూడి ఉదయ్‌భాస్కర్, బొర్రా రజనీ ప్రసాద్, జాలెం వెంకట్రావు, బొర్రా కృష్ణారావు, ఉన్నమట్ల బ్రహ్మానందం, ఉయ్యూరి జోషిబాబు, ప్రజాప్రతినిధులు, సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తా.. అందుబాటులో ఉంటా

- హోం మంత్రి, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత
- ఐదు గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం



గోపాలపురం మండలం గుడ్డిగూడెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న హోం మంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత

గోపాలపురం: ప్రతి సమస్యనూ పరిష్కరిస్తా.. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతగా పని చేస్తా.. అని రాష్ట్ర హోం మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత అన్నారు. గోపాలపురం మండలం తొక్కిరెడ్డిగూడెం, గుడ్డిగూడెం, కొవ్వూరుపాడు, కరగపాడు, బుచ్చియ్యపాలెం గ్రామాల్లో సోమవారం ఆమె పార్టీ శ్రేణులతో కలసి విస్తృతంగా పర్యటించి, ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి పనిచేసే వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. కూటమి పేరుతో మోసం చేయడానికి వస్తారు, జాగ్రత్తగా ఉండాలని ఆమె ఓటర్లకు సూచించారు. జగనన్నపై ఎన్ని కుట్రలు చేసినా అంతిమ విజయం వైఎస్సార్ సీపీదే అని ఆమె అన్నారు. అసెంబ్లీ అభ్యర్థిగా తనకు, రాజమహేంద్రవరం లోక్‌సభ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, మహిళా కన్వీనర్ యండపల్లి కవిత, ఏఎంసీ వైస్ చైర్మన్ తోట నాగేశ్వరరావు, సర్పంచులు మడిచర్ల ప్రసాద్, చిలకా లక్ష్మణస్వామి, బొమ్మిన నాగమణి, వేగివాడ శ్రీను, ఎస్కే మస్తాన్‌బాబా మండలంలోని వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ తరఫున బూరుగుపల్లి ప్రచారం



ఇంటింటా ప్రచారం చేస్తున్న జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు

ఉండ్రాజవరం: వైఎస్సార్ సీపీ లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థులకు మద్దతుగా, ఆ పార్టీ నాయకుడు, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు సోమవారం సాయంత్రం ఉండ్రాజవరంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. గత ఐదేళ్లల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు, గ్రామానికి చేసిన మంచిని ఆయన వివరించారు. ముందుగా గ్రామంలోని సిద్ధి వినాయకుడు, గోగులమ్మ వారిని సుబ్బారావు దర్శించుకున్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి నిడదవోలు ఎమ్మెల్యేగా శ్రీనివాస్‌నాయుడిని, రాజమహేంద్రవరం ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. ఈ ప్రచారంలో సర్పంచ్ మెండే వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యుడు గాడి కృష్ణహర్, సొసైటీ అధ్యక్షుడు సంకురాత్రి సుబ్బారావు, కరికాలబత్తుల కార్పొరేషన్ డైరెక్టర్ కరెళ్ల మంగాదేవి శ్రీనివాస్, బీఎస్సార్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్ని కూటములు వచ్చినా మళ్లీ జగనే సీఎం

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్‌నాయుడు
- కాటకోటేశ్వరం, ఉనకరమిల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



కాటకోటేశ్వరంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్‌నాయుడు, పార్టీ శ్రేణులు

నిడదవోలు రూరల్: ఎన్ని పార్టీలు జత కట్టి వచ్చినా ఈ ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యమని వైఎస్సార్ సీపీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని కాటకోటేశ్వరం, ఉనకరమిల్లి గ్రామాల్లో ఆయన సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు అందజేసి ఫ్యాన్ గుర్తుకే రెండు ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను మోసగించేందుకే చంద్రబాబు కూటమి కట్టారన్నారు. రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత పురోభివృద్ధిలోకి తీసుకు వెళ్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రచారంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు పెనుగుర్తి రాము, పార్టీ గ్రామ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి రామచంద్రరావు, తిరుమలశెట్టి అయ్యప్ప, కోసూరి అప్పారావు, సొసైటీ అధ్యక్షుడు గుంటుపల్లి కృష్ణమూర్తి, నాయకులు పోలిరెడ్డి శివరామకృష్ణ, జి.మనోహర్, హరిశ్చంద్ర, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నిడదవోలు 22వ వార్డులో మున్సిపల్ చైర్మన్..

నిడదవోలు: ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్ నాయుడికి మద్దతుగా మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ పట్టణంలోని 22వ వార్డు వైఎస్సార్ కాలనీలో సోమవారం ఎన్నికల ప్రచారం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయా లేదా, అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి అవినీతి మచ్చలేని శ్రీనివాసనాయుడిని మళ్లీ గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగడ బాలరాజు, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు ముంగండి కృపానందం, పలువురు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

18న కొవ్వూరులో నామినేషన్ దాఖలు



నెలటూరులో సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి తలారి. వేదికపై రాజీవ్ కృష్ణ



యువకులకు కండువాలు వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న తలారి వెంకట్రావు

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు రాజీవ్ కృష్ణ
- పార్టీ శ్రేణులతో నెలటూరులో సమావేశం

చాగల్లు: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపునకు పార్టీ శ్రేణులంతా కష్టపడి పని చేయాలని ఆ పార్టీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు ఎస్.రాజీవ్ కృష్ణ కోరారు. నెలటూరు గ్రామంలో సోమవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాజీవ్‌కృష్ణ మాట్లాడుతూ తలారి వెంకట్రావు ఈ నెల 18న కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తారన్నారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు భారీగా తరలి వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పార్టీ శ్రేణులు 18వ తేదీ ఉదయాన్నే అన్ని గ్రామాల నుంచీ కొవ్వూరు తరలి రావాలని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, జెడ్పీటీసీ సభ్యురాలు గారపాటి విజయదుర్గ, శ్రీనివాస్, వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, పార్టీ మండల గౌరవాధ్యక్ష, అధ్యక్షులు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు

మండలంలోని ఊనగట్ల గ్రామానికి చెందిన తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన పలువురు యువకులు వైఎస్సార్ సీపీలో చేరారు. వారంతా సోమవారం చాగల్లు వచ్చి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు సమక్షంలో పార్టీలో చేరారు. మట్టపర్తి రమణ, మెరిపో పండు, డి.సత్తిబాబు, మెరిపో చంద్రశేఖర్, నూతంగి రవి మరికొందరు యువకులకు తలారి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంద్రోతు సురేంద్రకుమార్, నాయకులు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, సర్పంచ్ మట్టా వెంకట్రావు ఊనగట్ల నాయకులు పిల్లి నాగరాజు, మెరిపో సూరిచంద్రం, కంకటాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరులో ఆభరణాల చోరీ

కొవ్వూరు: స్థానిక గౌతమీనగర్‌లో నివసించే గంద్రోతు చంద్రవతి అనే మహిళ ఇంట్లో బంగారు ఆభరణాల చోరీ జరిగింది. బాధితురాలు గత నెలాఖరున ఇంటికి తాళం వేసుకుని మండలంలోని వాడపల్లి గ్రామంలోని పుట్టింటికి వెళ్లింది. ఆమె సోమవారం సాయంత్రం తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగలకొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువా తాళాలు బద్దలు కొట్టి ఉంది. అందులో భద్రపరిచిన బంగారు నల్లపూసలు, ఉంగరం చోరీకి గురైనట్టు ఆమె గుర్తించింది. దీనిపై చంద్రవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేశామని టౌన్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ బాబురావు తెలిపారు.

పోతవరంలో విగ్రహాల పునఃప్రతిష్ఠ



పూజలు అందుకుంటున్న పునః ప్రతిష్ఠించిన విగ్రహాలు



వెలగదుర్రులో హోమం చేస్తున్న భక్తులు

నల్లజర్ల: పోతవరం గ్రామంలోని కోదండ రామాలయంలో విగ్రహాల పునఃప్రతిష్ఠ వేడుక సోమవారం వైభవంగా జరిగింది. పాత పంచాయతీ కార్యాలయం పక్కనే కొలిమి చింతమేడగా పిలిచే కోదండ రామాలయంలో సీతారామ లక్ష్మణ, ఆంజనేయ విగ్రహాలను వేద పండితులు హనుమంతరుల కృష్ణమూర్తి శర్మ, సతీష్‌శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. దేవక అప్పారావు, రంగ దుర్గారావు, బాలాజీ, లక్ష్మీదుర్గారావు దంపతులు పూజాదికాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 3 వేల మందికి అన్న సమారాధన చేశారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా సిద్ధి వినాయక విగ్రహ ప్రతిష్ఠ

ఉండ్రాజవరం: వెలగదుర్రు గ్రామంలో కుమ్మరి శాలివాహన సంఘం ఆధ్వర్యంలో కొత్తగా నిర్మించిన సిద్ధి వినాయక స్వామి ఆలయ ప్రారంభోత్సవం, స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలను సోమవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద మంత్రాలతో హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్న సమారాధనలో పాల్గొన్నారు. కమిటీ నిర్వాహకులు గున్నెపల్లి వెంకటేశ్వరరావు, మడిచెర్ల తుకారం తదితరులు ఏర్పాట్లను పరివేక్షించారు.

గోపవరంలో 40 లీటర్ల సారా స్వాధీనం

దేవరపల్లి: స్థానిక ఎస్ఈబీ స్టేషన్ పరిధిలోని గోపాలపురం మండలం గోపవరం గ్రామంలో సోమవారం 40 లీటర్ల సారాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్టు సీఐ కె. వెంకటేశ్వరస్వామి తెలిపారు. దాడుల్లో ఎస్సై పి.సుధీర్, సిబ్బంది పాల్గొన్నట్టు తెలిపారు.